# శ్రీ షిరిడీ సాయి వైభవమ్



శ్రద్ధ సబూరి



సాయిదర్బర్ , హైదరాబాద్

వ్యవస్థాపకులు, సలహాదారు : సాయిబానిస శ్రీరావాడ గోపాలరావు గారు

నిర్వహణ : ఆత్రేయపురపు త్యాగరాజు, నిజాంపేట, హైదరాబాద్

సంచిక – 4 మార్చ్, 2018

సాయి బంధువులందరికీ శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు





## సాయి ఉపాసక్ కలం నుండి

పాఠకులందరికీ శ్రీ విళంబి నామ సంవత్సర శుభాకాంక్షలు..అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాభివృధ్ధిగా కలకాలం సుఖసంతోషాలతో వర్ధిల్లచేయమని బాబాను ప్రార్ధిస్తున్నాను. మన పత్రికను ఇంకా సర్వాంగ సుందరంగా, మరిన్ని బాబా లీలలు, ఆధ్యాత్మిక విషయాలతో సాయిబంధువులను మెప్పించేలా నాకు శక్తినిమ్మని బాబాను ప్రార్ధిస్తున్నాను. పాఠకులు కూడా తమకు బాబా ద్వారా కలిగిన అనుభవాలను క్రింద ఇచ్చిన మైల్ ఐ.డి. కి పంపినట్లయితే వాటిని కూడా మన పత్రికలో ప్రచురిస్తాను. క్రిందటి నెల మైల్ ఐ.డి. లో ఒక అక్షరం తప్పుగా ప్రచురితమయింది. క్షంతవ్యుడను.

సాయిఉపాసక్

త్యాగరాజు మైల్. ఐ.డి. saidarbar@gmail.com



కాకాసాహెబ్ దీక్షిత్ డైరీ - 1వ. అధ్యాయం

ఒకసారి కొంతమంది యువకులు శ్రీసాయిబాబా దర్శనార్థం షిరిడీకి వచ్చారు.  వారికి శ్రీసాయిబాబాని ఫొటో తీద్దామని ఎంతో కోరికగా వుంది. రెండు రోజులుగా ప్రయత్నించినా కూడా వారు శ్రీసాయిబాబాను ఫొటో తీయలేకపోయారు.

ఫొటో తీయాలనే తమ కోరికను మాధవరావు దేశ్ పాండే (శ్యామాకు) విన్నవించుకుని, తమ తరఫున బాబాకి తమ కోరికను వెల్లడించమని వేడుకొన్నారు. సాఠేవాడా  దగ్గరనున్న లెండీ నుంచి బాబా తిరిగి వచ్చేటప్పుడు బాబాను కలుసుకోవచ్చని శ్యామా చెప్పారు. వారందరూ వాడావైపు వెళ్ళి బాబా రాక కోసం ఎదురు చూస్తూ నుంచున్నారు.  శ్రీసాయిబాబా లెండీనుంచి తిరిగి సాఠేవాడా వద్దకు చేరుకొన్నారు. ఆయన శ్యామాని, “శ్యామా ఏమిటిదంతా “ అని అడిగారు.

అందుకు శ్యామా "బాబా ఈ యువకులంతా మిమ్మల్ని ఫొటో తీసుకోవాలని కోరుతున్నారు. అందుకే అందరూ యిక్కడ నిలబడి ఉన్నారు.  మీరొక్కసారి యిక్కడ నిలబడండి, వారు ఫొటో తీసుకుంటారు" అన్నాడు శ్యామా. అపుడు శ్రీసాయి యిలా అన్నారు.  నాఫొటో తీయాల్సిన అవసరం లేదు.  నానిజస్వరూపం తెలుసుకోవాలనుకుంటే మన మధ్యనున్న అడ్డుగోడను పడగొడితే చాలు" అని ఒక్కక్షణం కూడా అక్కడ నిలబడకుండా మసీదుకు తరలిపోయారు బాబా.  ఆ యువకులంతా బాబావారి మూడున్నర మూరల (5అ.8 అం.) శరీరాన్ని ఫొటో తీద్దామనుకున్నారు కాని, అది ఆయన అసలయిన స్వరూపం కాదు. ఈప్రపంచం, శ్రీసాయిబాబా వేరు కాదనే భావాన్ని వారు గ్రహించుకోలేకపోయారు.  ఆ యువకుల హృదయాలలో ద్వైత భావం ఉన్నందువలననే బాబాను మానవుడిగా చూశారు.  బాబా వారిలో ఉన్న ఈ అజ్ఞానాన్ని గుర్తించి, ఈ అజ్ఞానమనే అడ్డుగోడ నిర్మూలింపబడాలని చెప్పారు.

బాబా  ఆదేశంలోని అంతరార్థాన్ని గ్రహించి, భక్తులు అజ్ఞానమనే అడ్డుగోడను పడగొట్టి బాబాయొక్క సత్యమైన స్వరూపాన్ని దర్శించగలగాలి.

ఒకసారి ప్రభు సమాజ్ కి చెందిన ఒక వ్యక్తి శ్రీసాయిబాబా దర్శనానికి వచ్చాడు. ఆయన అంతకు మునుపు బొంబాయిలోని ఒక ఫొటో స్టుడియోలో కొంతకాలం పని చేశారు. ఆయన కూడా బాబా ఫొటో తీయాలని తనతో కెమెరా పట్టుకుని వచ్చాడు. బాబా అనుమతి లేకుండా ఫొటో తీయాలని అతని ఉద్దేశ్యం. అలాగే ఫొటో తీశాడు కూడా. తరువాత స్టూడియోకి తిరిగి వచ్చి నెగెటివ్ కడిగి చూస్తే అందులో బాబా ఫొటోకి బదులు తన గురువు ఫొటో కనబటేటప్పటికి ఆశ్చర్యపోయాడు. ఆ అసాధారణ చమత్కారానికి ఆవ్యక్తి ముగ్ధుడయాడు. ఎవరి గురువుపట్ల వారు నిశ్చల భక్తి కలిగి ఉండాలని బాబా తమ లీల ద్వారా తెలియచెప్పారని గ్రహించాడు.

పీతాంబరం:

శ్రీసాయిబాబా మహాసమాధి అయిన 2, 3 సంవత్సరాల తరువాత మాహిం వెస్ట్ ప్రాంతంలో బాగా వరదలు వచ్చాయి. ప్రధాన్ గారికి ఒకరోజు బాబా స్వప్నంలో దర్శనమిచ్చి ఒక పెట్టెను చూపుతూ "అందులో ఆకు పచ్చని పట్టుగుడ్డ ఉంది కదా. దానిని నా సమాధిపై కప్పడానికి షిరిడీ పంపు" అని చెప్పారు. ఆపెట్టెలో ఆవస్త్రం ఉందన్న విషయమే మర్చిపోయారు ప్రధాన్ గారు.

తరువాత ఆయన ఆపెట్టిని గుర్తుకు తెచ్చుకుని అందులో చూసి వెతకగా ఆయన ఆశ్చర్యపోయేలా పీతాంబరం కనిపించింది. అదే ప్రకారంగా ఆయన షిరిడీ సంస్థాన్ వారికి తనకు వచ్చిన స్వప్నం గురించి చెప్పి ఆ పీతాంబరాన్ని షిరిడీకి పంపించారు. తరువాత 1923 దాకా శ్రీసాయిబాబావారి మహా సమాధిపై కప్పడానికి ఈవస్త్రాన్ని తరచూ ఉపయోగించేవారు.

తండ్రి కొడుకులు:

ముంబాయిలోని థానే ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి కుమారుడు కొన్నేళ్ళ క్రితం తప్పిపోయాడు. తండ్రి, కుమారుని వెతకడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కాని, ఏమీ ఫలితం కనపడలేదు. ఆఖరికి అతను షిరిడీ వెళ్ళి శ్రీసాయి మహరాజ్ కు తన పరిస్థితిని గురించి విన్నవించి, తన కుమారుడిని తనకు దొరికేటట్లు చేయమని బాబాను ప్రార్థించాడు. బాబా అతనితో త్వరలోనే నీవు నీ కుమారుడిని కలుసుకుంటావు అని చెప్పారు. షిరిడీలో రెండు రోజులున్న తరువాత బాబా అనుమతి తీసుకుని మన్మాడ్ నుంచి బొంబాయి వెళ్ళే రైలు ఎక్కి థానేలో దిగాడు. అదే సమయంలో బొంబాయినుండి వచ్చే రైలు కూడా థానే ప్లాట్ ఫారం మీద ఆగింది.

తప్పిపోయిన ఆవ్యక్తి కుమారుడు రైలులోనుండి దిగాడు. బాబా చెప్పినట్లే తండ్రీ కొడుకులు కలుసుకున్నారు. శ్రీసాయిబాబా చెప్పిన మాటలు నిజమయ్యాయి.

(ఇంకా ఉంది)

# శ్రీ సాయి – ధన్వంతరి

సాయి లీల ద్వైమాసపత్రిక మార్చి – ఏప్రిల్, 2015 సంచికలో ప్రచురింపబడ్డ విశ్లేషాత్మక వ్యాసాన్ని ఈ సంచికలో ప్రచురిస్తున్నాను.

సంకలనమ్ : షంషద్ ఆలీ బేగ్

మరాఠీనుండి ఆంగ్లానువాదమ్ : మిస్ మినాల్ వినాయక్ దాల్వీ

తెలుగు అనువాదమ్ : ఆత్రేయపురపు త్యాగరాజు

ఆత్మ భగవంతునితో అనుసంధానమై ఉంటుంది. మనం ఈ భూప్రపంచంలో ఉన్నపుడు ఆత్మకి మన శరీరమే నివాస స్థానం. అందువల్లనే మనం మన శరీరాన్ని రోగగ్రస్తం కానీయకుండా ఆరోగ్యకరంగాను, పరిశుభ్రంగాను ఉండేలాగ జాగ్రత్తగా చూసుకుంటూ ఉండాలి.

బాబా షిరిడీలో ఉన్న కాలంలో మానవజాతి సంక్షేమం కోసం నిరంతరం శ్రమించారు. మన మనస్సు, బుధ్ధి అంతే కాకుండా ఆరోగ్యకరమయిన శరీరం వాటియొక్క ప్రాముఖ్యాన్ని అందరికీ తెలియచేశారు. సాయిబాబా షిరిడీలో గొప్ప వైద్యునిగా పేరుగాంచారు. దీని గురించి మనం శ్రీసాయి సత్ చరిత్ర 7వ. అధ్యాయంలో గమనించవచ్చు.


"తొలిదినములలో బాబా తెల్ల తలపాగా, శుభ్రమయిన ధోవతి, చొక్కా ధరించేవారు. మొదట గ్రామములో రోగులను పరీక్షించి, ఔషధములనిచ్చేడివారు. వారి చేతితో నిచ్చిన మందులు పని చేయుచుండేడివి. మంచి హస్తవాసి గల వైద్యునిగా పేరువచ్చెను."

– ఓ.వి. 46

బాబా రోగులకు మందులివ్వడమే కాదు, మంచి ఆరోగ్యంగా ఉండాలంటే ఏవిధంగా నడచుకోవాలో, శరీరాన్ని ఏవిధంగా కాపాడుకోవాలో మొదలయిన విషయాలమీద సలహాలు యిస్తూ ఉండేవారు. ఆయన ప్రతిరోజు లెండీబాగ్ కు అప్పుడప్పుడు ప్రక్కనే ఉన్న గ్రామమయిన రహతాకు కాలినడకనే వెళ్ళి వస్తూ ఉండేవారు.



ఆయన ఎప్పుడూ ఏ వాహనంలోను ప్రయాణం చేయలేదు. ఆఖరికి ఆయనయందు భక్తితో పల్లకీ ఉత్సవాన్ని జరిపించే సమయంలో కూడా నడిచే వెళ్ళారు గాని పల్లకీ మాత్రం ఎక్కలేదు. తరచూ ఆయన గంటల తరబడి ప్రకృతిలో లీనమయ్యి ఉండేవారు. ఆయన షిరిడీలో మొట్టమొదటిసారిగా గురుస్థానమయిన వేపచెట్టు క్రింద తపమాచరిస్తూ ధాన్యముద్రలో కనిపించారు.



,

దీనిని బట్టి మంచి ఆరోగ్యంతో జీవించాలంటే ప్రకృతి, నడక, ధ్యానం ఎంత సహాయపడతాయో వాటి ప్రాముఖ్యత గురించి బాబా తెలియచేశారు.

నేటి కాలంలో 'యోగాభ్యాసం' నాగరికతగా మారింది. కాని బాబా ఆరోజుల్లోనే యోగాభ్యాసం చేసేవారు. బాబా హటయోగం, ఖండయోగం చేసేవారనే విషయం మనకు శ్రీసాయి సత్ చరిత్ర 7వ.అధ్యాయంలో కనిపిస్తుంది.

బాబా చేసిన మరొక అధ్భుతం ఏమిటంటే, షిరిడీ పొలిమేరలలో గోధుమ పిండిని చల్లించి కలరా మహమ్మారిని షిరిడీలోకి ప్రవేశించకుండా నిరోధించడం. ఇది ఎంతో అధ్భుతమని అందరూ భావించినప్పటికీ, దీని వెనుక ఒక శాస్త్రీయమయిన, సైన్స్ కి సంబంధించి మూలాధారమయిన విషయం ఒకటి ఉన్నదని

1928వ.సంవత్సరంలో సాయిలీలా మాసపత్రికలో ఒక వ్యాసం ప్రచురింపబడింది. కాని ఒక డాక్టర్ అందులో ప్రచురింపబడ్డ వ్యాసాన్ని విమర్శిస్తూ తన వ్యతిరేకతను తెలియచేసాడు. ఆ వ్యాసరచయితను నిందిస్తూ "నువ్వు రాసినదేమిటి? కలరా అనేది ఒక దుష్ట శక్తా? దుష్ట దేవతా ? దానిని మనం చూడగలమా? ఇటువంటి వ్యాసాలు పాఠకులను తప్పుత్రోవ పట్టిస్తాయి. నువ్వు చదివేదేమో బయాలజీ, నువ్వు మైక్రోబయాలజిస్టువి కూడాను. కలరాకు కారణమయ్యే సూక్ష్మజీవులు అమ్మవారిగా రూపంమార్చుకుని మనకు కనిపిస్తుందా? మైక్రోబయాలజిస్టువి అయినా నువ్వు ఆవిధంగా చెప్పడం భావ్యమేనా" అని విమర్శించాడు.

ఆ వ్యాస రచయిత, ఆ డాక్టరు ఇద్దరూ కలిసి ఈ విషయం మీద చర్చించుకున్నారు. డాక్టరు వ్యాసరచయితను కలుసుకున్నాడు.

డాక్టరు : "కలరా సూక్ష్మ జీవుల వల్ల వ్యాప్తి చెందుతుంది, అవునా?"

రచయిత: "అవును"

డాక్టర్ : అయితే కాలవ దగ్గర కలరా మహమ్మారి అనే ఒక స్త్రీ కూర్చుని ఉందని అంటున్నావు కదా, దాని అర్థం ఏమిటి?"

రచయిత : గ్రామ సరిహద్దు కాలవ వెంబడే ఉంది. కాలువలో నీరు నిండుగా ప్రవహిస్తూ ఉంది. కలుషితమయిన నీటిలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది వ్యాపిస్తాయనే విషయం మనకు తెలుసు. ఎవరయినా రోగి యొక్క దుస్తులను ఆ కాలవలో ఉతికినపుడు, సూక్ష్మజీవులు నీటిలో వ్యాపిస్తాయి. తరవాత మరెవరయినా దుస్తులను ఆ నీటిలో ఉతికినట్లయితే ఆ సూక్ష్మజీవులు ఆ దుస్తులను అంటిపెట్టుకుని ఉంటాయి. ఆ బట్టలను తెచ్చి ఆరవేసినపుడు వాటిమీద ఆ సూక్ష్మజీవులు ఉంటాయనే విషయం సాయిబాబాకు తెలుసు. ఆవిధంగా ఆరబెట్టిన దుస్తులను ఒక స్త్రీగా సాయిబాబా వర్ణించి ఆ మహమ్మారి షిరిడీలోకి ఎపుడు ప్రవేశిద్దామా అని ఎదురు చూస్తూ ఉందని గూఢార్థంతో ఆవిధంగా మాట్లాడారు. లెండీలో ఆసమయంలో తగినంత నీరు లేక ఎండిపోయినందువల్ల గ్రామస్తులందరూ కాలువలోని నీటినే ఉపయోగిస్తూ ఉండేవారు. కాలువలోకి పరిశుభ్రమయిన నీటి ప్రవాహం వచ్చేలోపులోనే రోగకారకమయిన సూక్ష్మజీవులు

వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. అందువల్లనే సాయిబాబా ముందుగానే ఊహించి మందులను తయారు చేస్తూ ఉండేవారు.

డాక్టర్ : అయితే పిండిని నీటిలోను, కాలవ సరిహద్దులలోను చల్లినంత మాత్రం చేత కలరా వ్యాధి వ్యాపించకుండా అరికట్టవచ్చా?"

రచయిత : మీరడిగిన ప్రశ్న బాగుంది. కాని మీప్రశ్నకు సమాధానం చెప్పగలిగే జ్ఞానం, సమర్ధత నాకు లేవు. అయితే నేను నమ్మే విషయాన్ని మాత్రం చెబుతాను. కలరా నివారణకి మందు వాక్సిన్ (టీకా). కలరాకు కారణమయ్యే సూక్ష్మ జీవుల మీదనే ప్రయోగాలు చేసి ఒక విధమయిన వాక్సిన్ తయారు చేస్తారు అవునా?"

డాక్టర్ : అవును

రచయిత : వాక్సిన్ అంటే ఏమిటి?

డాక్టర్ : సూక్ష్మ జీవులను కాంజీ అనబడే నల్ల కారట్ ల జ్యూస్ యొక్క ద్రావణంలో వేస్తారు.



(నల్ల కారెట్స్)

అందులో ఈ సూక్ష్మజీవులు ఒక ఆకారం వరకు పెరిగి పెద్దవయి ఒక విధమయిన ద్రవాన్ని స్రవిస్తాయి. ఆద్రవం కలరా సూక్ష్మ జీవులన్నిటినీ చంపివేస్తుంది. అటువంటి స్థితిలో ఆద్రవాన్ని వాక్సిన్ ద్వారా రోగి శరీరంలోనికి ఎక్కించినపుడు శరీరంలో ఉన్న సూక్ష్మజీవులన్నీ చనిపోతాయి.

రచయిత : శ్రీసాయిబాబా కూడా సరిగ్గా యిదే విధానాన్ని అమలుపరచారు. గోధుమపిండిని గ్రామ సరిహద్దులవద్ద చల్లమని బాబా చెప్పారు. ఆ విధంగా చల్లబడిన పిండి కాలవ వెంబడి నీటిలో కలిసింది. పిండి నీటిఆవిరితో కలిసి ఆవిరయినపుడు ఆ పిండిలో ఒక విధమయిన మార్పు జరుగుతుంది. పిండి నీటిలో ఉన్నందువల్ల నీటిలో ఉన్న కలరా సూక్ష్మ జీవులు నశిస్తాయి అవునా?

డాక్టర్, రచయిత చెప్పినదానికి ఆఖరికి అంగీకరించాడు. అతని సందేహం తీరిపోయింది. అవును ఆవిధంగా జరగడానికి ఆస్కారం ఉంది అని ఒప్పుకున్నాడు.

సాయిబాబా చేసే చర్యలు మనలాంటి సామాన్యులు అర్థం చేసుకోలేనివిగా ఉంటాయి.

అయితే పరిశోధించే దృష్టితోను, తెలుసుకోవాలనే ఆసక్తితోను సాధ్యమయినంత వరకు తెలుసుకోవడానికి మనం ప్రయత్నించాలి.

ఈవిధంగా సాయిబాబా ప్రజలను రోగాలబారిన పడకుండా కాపాడి అందరూ మంచి ఆరోగ్యవంతంగా ఉండేలా కాపాడుతూ వచ్చారు. సాయిబాబా రోగులకు సేవచేసి వారికి వైద్యం చేసినట్లే నేటికీ ఆస్పత్రులను నిర్మించి ప్రజలకు సేవా కార్యక్రమాలను షిరిడీలో కొనసాగిస్తూ ఉన్నారు.

(సర్వం శ్రీసాయినాథార్పణమస్తు)



సాయిబానిస శ్రీరావాడ గోపాలరావుగారు రచించిన ఆనాటి ఋషులు – నేటి షిరిడీ సాయి నుండి…

సనాతన ధర్మంలో త్రేతాయుగము, ద్వాపర యుగములోని ఆనాటి ఋషులు, ఈనాటి కలియుగములోని షిరిడీ సాయి.

(గత సంచిక తరువాయి)

8. ఆపస్థంబ ముని : ఈయన 5వ.శతాబ్దములో జన్మించినాడు. ఈయన ముఖ్యముగా కృష్ణ యజుర్వేదమును మానవాళికి అందచేసినారు. ఆపస్థంబుడు శాకల్య మహాముని శిష్యుడు. ఈయన ఒకనాడు ఒక బ్రాహ్మణుని కోరికపై అతని ఇంట జరుగుతున్న శ్రాద్ధకర్మలో భోక్తగా వెళ్ళినాడు. పిండప్రదానము తర్వాత ఆ బ్రాహ్మణుడు ఆపస్థంబునకు భోజనము వడ్డించినాడు. కాని ఆపస్థంబుడు తృప్తి చెందలేదు. ఎంత వడ్డించినా తృప్తిచెందకపోవడంతో ఆ బ్రాహ్మణుడు కోపముతో శపించటానికి తన కమండలములోని నీరును చేతిలో తీసుకొని ఆపస్థంబునిపై చల్లగా ఆపస్థంబ మహర్షి ఆ నీటి బిందువులను

గాలిలోనే ఆపివేసినాడు. ఆపమును అంటే నీటిని గాలిలోనే స్థంభింపచేసినవాడుగాన ఆ ఋషికి ఆపస్థంబుడు అని పేరు వచ్చినది. మరి మనము ఇటువంటి సంఘటనను శ్రీ సాయిసత్ చరిత్ర 28వ.అధ్యాయములో చూడగలము. ఒక మకర సంక్రాంతినాడు బాబా మేఘునితో " ఓ మేఘా ఒక చిన్న ఉపకారము చేసిపెట్టు. శరీరమునకు తల ముఖ్యము కావున తలపై నీళ్ళు పోయుము. శరీరము అంతటిపై ప్రోసినట్లు అగును." అని అన్నారు. దానికి మేఘుడు అంగీకరించెను. కాని అతను భక్తి పారవశ్యముతో "హర గంగే హర గంగే" అని శరీరము అంతటిపై నీళ్ళు పోసెను. అభిషేకము తరువాత కుండను పక్కకు పెట్టి బాబావైపు చూచెను. వాని ఆశ్చర్యమునకు ఆనందమునకు అంతులేకుండెను. బాబా తల మాత్రమే తడిసి శరీరము అంతా పొడిగా నుండెను. బాబా ఆ విధముగా తన శరీరము తడవకుండ ఆ కుండలోని నీటిని గాలిలోనే స్థంభింపచేసెను. ఈ కలియుగములోని ఆపస్థంబ మహర్షిగా పేరుగాంచెను. ఒకసారి షిరిడీలో కుండపోతగా వర్షము పడసాగెను. షిరిడీ ప్రజలు తమను ఆ వర్షమునుండి కాపాడమని బాబాను వేడుకొనిరి. బాబా ఆకాశములోని మేఘాలను ఆదేశించిరి. వర్షము తగ్గిపోయెను.

(ఇంకా ఉంది)

## షిరిడీ వార్తలు



మార్చ్ నెలాఖరు నుంచి షిరిడినుండి 24 గంటలు విమాన సర్వీసులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం షిరిడీనుండి హైదరాబాద్ కు, ముంబాయికి రెండు విమానాలు నడుస్తున్నాయి. ఇండిగో తన సర్వీసులను మరింతగా పెంచడానికి సన్నాహాలు చేస్తోంది.

త్వరలోనే బెంగళూరునుంచి, మరొకటి భోపాల్, నాగపూర్ ల మీదుగా కూడా విమాన సర్వీసులు ప్రారంభమవుతాయి.

వచ్చే నెలలోనే షిరిడీ విమానాశ్రయానికి CISF సాయిద రక్షణ బలగాలయొక్క రక్షణ కల్పించబోతున్నారు.

నాసిక్ – షిరిడీ 51 కి.మీ. దూరంగల రోడ్డు మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఒక దారిని కాలినడకన పల్లకీ యాత్ర చేసేవారికోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు.






సాయిని నిరంతరం మన మనసులోనే నిలుపుకోవాలంటే ముఖ్యంగా కావలసినది నామస్మరణ. సాయి సత్ చరిత్రలోని ఘట్టాలను మన మదిలోకి తెచ్చుకోవడం కూడా ఆయనని మనం స్మరిసున్నట్లే లెక్క. బాబా వారు అప్పుడే కాదు, ఇప్పుడు కూడా తన భక్తులకు ఎన్నో అనుభవాలను ప్రసాదిస్తూనే ఉన్నారు. అటువంటి లీలలను మనం చదువుతున్నపుడు మనకు కూడా అటువంటి అనుభవాలు కలిగితే బాగుండును అన్నంతగా మనలని ప్రభావితం చేస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

పాఠకులకి కూడా బాబావారు ప్రసాదించిన అనుభవాలు ఏమన్నా ఉన్నట్లయితే మైల్ ద్వారా పంపించండి. మన పత్రికలో ప్రచురిస్తాను.

saidarbar@gmail.com కు మీ అనుభవాలను పంపించగలరు.

సాయి ఉపాసక్ --- త్యాగరాజు